నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 9 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కార్మికుల శ్రేయస్సే ధ్యేయం

యాజమాన్యం విభజించు పాలించు విధానాన్ని అవలంబిస్తున్నది

- స్థానిక కార్మికులకు తక్కువ వేతనం.. ఇతర రాష్ట్రాల కార్మికులకు అధిక వేతనం
- బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయండి..
- ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 8 : కార్మికుల శ్రేయస్సే బీఆర్ఎస్ పార్టీ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఆయన నివాసంలో మంగళవారం సిర్పూర్ పేపర్ మిల్లు ఎంప్లాయీస్ యునియన్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పటి గూండాయిజ రాజకీయాల కారణంగానే 2014లో పేపర్ మిల్లు మూతపడిందని, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో కేటీఆర్ పేపర్ మిల్లు పునఃప్రారంభానికి కృషి చేయడంతో 2018 ఆగస్టులో మిల్లు తెరుచుకుందని స్పష్టం చేశారు. జీఎస్టీ, కలప, బొగ్గు, స్టాంపు డ్యూటీ, విద్యుత్‌పై రాయితీ, పెద్ద వాగు నీటి వినియోగం ఉచితం వంటి రాయితీలు కల్పించి పేపర్ మిల్లును బీఆర్ఎస్ తెరిపించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం మిల్లు యాజమాన్యం స్థానిక కార్మికులను విధుల్లోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా ఇతర రాష్ట్రాల కార్మికులను విధుల్లోకి తీసుకోవడం దారణం అన్నారు. స్థానిక కార్మికులకు సుమారు రూ.20 వేలు, ఇతర రాష్ట్రాల కార్మికులకు సుమారు రూ.40 నుంచి రూ.50 వేల వరకు చెల్లించడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికీ గుర్తింపు సంఘం ఎన్నికలు జరగకపోవడం శోచనీయమన్నారు. క్యాంటీన్ కూడా లేక పోవడం దారుణమన్నారు. కార్మికులు పది నిమిషాలు కూడా సేద తీరనివ్వకుండా యాజమాన్యం నియంతల వ్యవహరిస్తుందన్నారు. కార్మికుల సెలవులు కుదించి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 15న కాగజ్‌నగర్ పట్టణంలో పేపర్ మిల్లు కార్మికులతో మేథోమధన సమావేశం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ శ్యాంరావు, కార్మిక సంఘం నాయకులు రాఘులయ్య, రాజన్న, అశోక్, శ్రీనివాస్, వెంకటస్వామి, ఓదెలు, సీపీ రాజ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ మిన్హాజ్ పాల్గొన్నారు.

భీమ్ దీక్షలు జరిపించడం అభినందనీయం

బెజ్జూర్, ఏప్రిల్ 8 : స్వేరో పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని బెజ్జూర్ మండలంలోని మర్తిడి గ్రామంలో భీమ్ దీక్షలు జరిపించడం అభినందనీయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సుప్రీం స్వేరో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా భీమ్ దీక్షలతోపాటు మహిళలకు ముగ్గుల పోటీలు కూడా నిర్వహించడంతో ఆనందం వ్యక్తం చేశారు. అదే విధంగా పాటల పోటీలను కూడా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లెండుగురి శ్యాంరావు, రాష్ట్ర స్వేరో ఉపాధ్యక్షుడు ఊశన్న, స్వేరో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు డోంగ్రె సురేశ్, యూత్ కన్వీనర్ కాసిపార రాజు, మండల అధ్యక్షుడు సారయ్య, సీనియర్ నాయకులు ఖాజా మోహినుద్దీన్, స్వేరో సభ్యులు మహేందర్, కుమ్మరి శ్రీనివాస్, గోలేటి కొండయ్య, ఆత్రం హరీశ్, రాజలింగు, గంధం శేఖర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న ప్రవీణ్ కుమార్

క్రీడలతో మానసికోల్లాసం

వాంకిడి, ఏప్రిల్ 8 : క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదపడుతాయని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. వాంకిడిలో డైలీ క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాంకిడి ప్రీమియర్ లీగ్ సీజన్-3 క్రీడలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువకులు క్రీడలతోపాటు చదువులో రాణించాలని సూచించారు. క్రీడాకారులు ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఆడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అజయ్ కుమార్, మాజీ సర్పంచ్‌లు తుకారాం, అయుబ్, బీఆర్ఎస్ తిర్యాణి మండలాధ్యక్షుడు జగదీశ్, వాంకిడి మండల వ్యాపారవేత్తలు విలాస్, అవినాశ్, ప్రవీణ్, డైలీ క్రికెట్ యూత్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రారంభించడానికి వస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

చెక్‌బౌన్స్ కేసులో టీచర్‌కు జైలు

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 8 : చెక్‌బౌన్స్ కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి ఏడాది జైలు శిక్షతోపాటు తను అప్పుగా తీసుకున్న డబ్బులు చెల్లించాలని స్థానిక సివిల్ జడ్జి, జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నిరోష మంగళవారం తీర్పు వెలువరించారు. కోర్ట్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉద్యోగి ఎన్.పారిజాత తన సొంత అవసరాల నిమిత్తం మంచిర్యాలకు చెందిన గుమ్మి జగన్నాథ్‌రెడ్డి వద్ద రూ.12లక్షలు అప్పుగా తీసుకుని ఒప్పందం ప్రకారం చెక్కులను అందజేసింది. తీసుకున్న అప్పు గడువు తీరిన తర్వాత చెక్కును బ్యాంకులో డిపాజిట్ చేయ గా అవి బౌన్స్ అయ్యాయి. దీంతో జగన్నాథ్‌రెడ్డి 2017లో కోర్టును ఆశ్రయించగా ఇరువర్గాల తరపున న్యాయవాదులు తమ వాదనలను న్యాయమూర్తి వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నిరోష ఏడాది జైలు శిక్షతోపాటు తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని తీర్పునిచ్చారు.

ధాన్యం కొనుగోలుదారులకు శిక్షణ

లక్షెట్టిపేట, ఏప్రిల్ 8 : లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల వ్యవసాయ, పౌర సరఫర, సహకార, రవాణ, మార్కెటింగ్, డీఆర్డీఏ, సెర్ప్ శాఖల, మెప్మా అధికారులతో కలిసి యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు అదనపు కలెక్టర్ మోతీలాల్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. నిబంధనల మేరకు రైతుల నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. గ్రేడ్-ఏ రకానికి క్వింటాల్‌కు రూ.2320, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధర నిర్ణయించామని తెలిపారు. తేమ శాతం 17 లోపు వచ్చిన తర్వాతే తూకం వేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు వివరాలు తప్పనిసరిగా నమోదు చేసి రైస్ మిల్లులకు తరలించాలన్నారు. సన్న రకం ధాన్యం మిల్లులకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో కేంద్రం పేరు, కోడ్, మద్దతు ధర, నాణ్యత ప్రమాణాలతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మరావు, డీఆర్డీవో కిషన్ , పౌర సరఫరాల మేనేజర్ శ్రీకల, తహసీల్దార్ దిలీప్ కుమార్ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్


వేంపల్లిలో ఇండస్ట్రియల్ పార్క్ కోసం ప్రతిపాదిత స్థలం (ఫైల్)

బలవంతులపై బక్క రైతు గెలుపు

ఇండస్ట్రియల్ పార్క్ కోసం రైతులను బెదిరించి సంతకాలు తీసుకోవద్దు

- మంచిర్యాల జిల్లా అధికారులకు హైకోర్టు ఆదేశాలు
- అధికారులు స్పందించకపోవడంతో రిట్ పిటిషన్ వేసిన బాధిత రైతులు
- విచారణ అనంతరం ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు
- భూ సేకరణ చేయాల్సి వస్తే 2013 చట్టాన్ని అనుసరించి చేయండి..
- ఇప్పటికైనా అధికార పార్టీ నాయకుల ఆగడాలకు చెక్ పడేనా?

మంచిర్యాల, ఏప్రిల్ 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఇండస్ట్రియల్ పార్క్ భూ సేకరణ విషయంలో ఖాళీ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయాలని రైతులను బలవంతపెట్టొద్దని హైకోర్టు మంచిర్యాల జిల్లా అధికారులను ఆదేశించింది. అలా చేయడం చట్ట విరుద్ధమని, రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందంటూ స్పష్టం చేసింది. భూ సేకరణ చేయాల్సి వస్తే 2013 భూ సేకరణ చట్టాన్ని అనుసరించి చేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని వేంపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 155, 156, 157, 158, 159, 160లలోని అసైన్డ్ భూములు, పోచంపాడు గ్రామంలోని సర్వే నంబర్లు 1, 2, 8, 9, 10లోని సీలింగ్ అసైన్డ్ భూములు మొత్తం కలిపి 276.09 ఎకరాలు ఐటీ/ఇండస్ట్రియల్ పార్క్ కోసం సేకరించాలని టీఐఐసీఎల్(తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్) ఆదేశించింది. ఈ మేరకు అధికార పార్టీ లీడర్లు ఈ సర్వే నంబర్లలో భూములు ఉన్న దళిత రైతులను భయభ్రాంతులకు గురి చేశారు. ఆ భూములన్నీ గతంలో మీకు మా సర్కార్ అసైన్డ్ చేసిన భూములేనని, మర్యాదగా ఇచ్చింది తీసుకుని భూములు ఇచ్చేయాలని బెదిరించారు. అనధికారిక మీటింగ్‌లు పెట్టి అధికారులను పిలిపించుకుని అమాయకులైన దళిత రైతులకు ఇష్టం లేకపోయినా తెల్లకాగితాలపై బలవంతంగా వారితో సంతకాలు చేయించుకున్నారు. ఈ వ్యవహారంపై కొందరు రైతులు ఎదురు తిరగడంతో వ్యవహారం బయటికి వచ్చింది. బాధితులను బెదిరించిన తీరుపై 'నమస్తే తెలంగాణ'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఇంత జరిగాక కూడా అధికార పార్టీ నాయకులు పట్టు విడవకపోవడంతో బాధిత రైతులు గజ్జెల్లి లక్ష్మి, అనసూయ, దొమ్మటి అర్జున్, మాడుగుల లింగయ్యలు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను విచారించిన కోర్టు బాధిత రైతులను ఇబ్బంది పెట్టొద్దంటూ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై బాధిత రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇది బలవంతులపై బక్క రైతులు సాధించిన విజయమని, ఇప్పటికైనా అధికారులు చట్ట ప్రకారం నడుచుకోవాలని కోరుతున్నారు.

కోర్టు ఆదేశాలతోనైనా.. బాధితులకు న్యాయం జరిగేనా..

బాధిత రైతుల పిటిషన్‌ను విచారించిన హై కోర్టు ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూ సేకరణ చేయడాన్ని తప్పుబట్టింది. ఇలా చేయడం 2013 భూ సేకరణ చట్టం సెక్షన్ 11 ప్రకారం చట్టవిరుద్ధమని, ఆర్టికల్ (21) జీవించే హక్కు, ఆర్టికల్(19) వాక్ స్వాతంత్రపు హక్కు, ఆర్టికల్ 300(ఏ) ఆస్తి హక్కులను ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొంది. భూ సేకరణ విషయంలో రైతులను ఖాళీ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయమని బలవంతపెట్టొద్దని ప్రతివాదులుగా ఉన్న కలెక్టర్, ఆర్డీవో, ఎంఆర్‌వోలను ఆదేశించింది. ప్రజా ప్రయోజనాల కోసం భూ సేకరణ చేయాల్సి వస్తే 2013 భూసేకరణ చట్టాన్ని అనుసరించి చేయాలని పేర్కొంది. కోర్టు తీర్పును నేపథ్యంలో భూ సేకరణ చట్టం 2013, సెక్షన్ 11ను అనుసరించి భూ సేకరణ చేయాల్సి వస్తే.. సేల్ డీడ్ వ్యాల్యూ (రిజిస్ట్రేషన్ వ్యాల్యూ)ను పరిగణలోకి తీసుకోవాలి. భూమి సేకరించే ప్రాంతం చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో గడిచిన మూడేళ్లలో ఎక్కువ రిజిస్ట్రేషన్ వ్యాల్యూ ఎంత ఉందో ఆ ధరనే కోల్పోయే భూముల ధరగా నిర్ణయించాలి. ఇలా ఎక్కువ ఉన్న ధరకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు రెట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు రెట్లు కలిపి ఆ వచ్చే మొత్తానికి అదనంగా 100 శాతం సొలాటియం ఇవ్వాలి. ఈ లెక్కన పోచంపాడు, వేంపల్లి గ్రామంలో ఐటీ హబ్ కొరకు తీసుకుంటున్న భూముల విలువ రిజిస్ట్రేషన్ వ్యాల్యూ రూ.4.50 లక్షల నుంచి రూ.12.60 లక్షలు వరకు చూపిస్తున్నది. నిబంధనల ప్రకారం ఎక్కువ ధర రూ.12.60 లక్షల చొప్పున ఎకరాకు చెల్లించాలి. గతంలో గ్రామీణ ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతం ప్రస్తుతం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో కలిసింది. ఇలా చూసుకున్నా రూ.12.60 లక్షలకు రెండు రెట్లు అంటే ఎకరానికి రూ.37.80 లక్షలు అవుతుంది. దానికి సొలాటియం వంద శాతం కలిపితే ఎకరానికి రూ.75 లక్షల పరిహారం చెల్లించాల్సి వస్తుంది.

ఎకరాకు రూ.13.50 లక్షలు ఇచ్చి.. మిగిలింది కొట్టేసే కుట్ర..

ఎకరం రూ.75 లక్షలు విలువ చేసే భూములకు ఎకరాకు రూ.13.50 లక్షలు చెల్లించి, మిగిలిన పరిహారం కొట్టేసేందుకు కొందరు అధికార పార్టీ నాయకులు కుట్రలు చేశారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2006లో ఇదే హాజీపూర్ మండలంలో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ కోసం భూ సేకరణ చేశారు. ఇందులో భూములు, ఇండ్లు కోల్పోయిన వారికి పరిహారం ఇచ్చే క్రమంలో స్థానిక నాయకులు జోక్యం చేసుకున్నారు. రైతులతో ముందే మాట్లాడుకుని వచ్చే పరిహారంలో 30 శాతానికి చెక్కులు రాయించుకున్నారు. ఓ ప్రైవేటు బ్యాంక్‌లో రైతులతో అకౌంట్లు ఓపెన్ చేయించి, పరిహారం పడగానే ముందే రాయించి పెట్టుకున్న చెక్కుల ద్వారా డబ్బులను లీడర్ల అకౌంట్లలోకి మళ్లించుకున్నారు. ఇప్పుడు అదే తరహాలో ఇండస్ట్రియల్ హబ్ పరిహారాన్ని కొట్టేసేందుకు సిద్ధమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసమే రైతులను బెదిరించి, బలవంతంగా ఖాళీ తెల్లకాగితాలపై సంతకాలు తీసుకున్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. హైకోర్టు తీర్పుతోనైనా పార్టీ లీడర్ల జోక్యం తగ్గాలని, ఏం ఉన్నా అధికారులే మాట్లాడాలంటున్నారు. తమకు న్యాయం జరిగే దాకా పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేస్తున్నారు.

పరిశ్రమలు పెట్టుకునే అవకాశం రైతులకే ఇవ్వాలి..

చట్ట ప్రకారం నోటిఫికేషన్ ఇచ్చాక భూ సేకరణ చేపట్టాలి. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో నోటిఫికేషన్ ఇచ్చాక మరోసారి కోర్టుకు వెళ్తాం. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఆర్టికల్ 39(బీ) అనుసరించి మా భూములను తీసుకుని ప్రైవేటు వారికి ఇచ్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ప్రజాప్రయోజనాల కోసం పనులు చేస్తే ఇవ్వడానికి మాకు అభ్యంతరం లేదు. కానీ.. మా భూములు ప్రైవేటు పెట్టుబడిదారులకు ఎలా ఇస్తారు. మా భూములను తీసుకోవద్దు. కావాలంటే ఆ భూముల్లో రోడ్లు వేసి, కరెంట్ ఇచ్చి, నీటి వసతులు కల్పిస్తే మా రైతులందరూ ఇండస్ట్రీలు పెట్టుకుని నలుగురికి ఉద్యోగాలు ఇస్తారు. రైతులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఆ మేరకు మమ్ములనే పారిశ్రామిక వేత్తలుగా ప్రోత్సహించాలి. ప్రజల భూములు తీసుకుని పెట్టుబడిదారులకు ఇవ్వడానికి మేం ఒప్పుకోం. చట్టప్రకారం నోటిఫికేషన్ ఇచ్చి భూ సేకరణ చేయడానికి మేం వ్యతిరేకం కాదు. కాకపోతే ఇండస్ట్రియల్ పార్క్ పేరిట ప్రైవేటు వ్యాపారులకు భూములు ఇవ్వడానికి కన్నా ముందు ఇండస్ట్రీలు పెట్టుకోడానికి మా రైతులకే అవకాశం ఇవ్వాలి. ఈ మేరకు రానున్న రోజుల్లో న్యాయ పోరాటం చేస్తాం.

- దొమ్మటి అర్జున్, రిట్ పిటిషన్ వేసిన బాధిత రైతు

బ్రాహ్మణపల్లిలో నీటి ఎద్దడి

వారం రోజుల నుంచి పని చేయని బోరుబావి విద్యుత్ మోటర్

***మంచిర్యాల జిల్లా** కోటపల్లి మండలం నక్కలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో నీటి ఎద్దడి నెలకొంది. ఎస్టీ కాలనీకి తాగునీరు సరఫరా చేసే బోరుబావి విద్యుత్ మోటర్ వారం రోజుల నుంచి పని చేయకున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఒక వైపు బోరుబావి చెడిపోవడం, మరోవైపు కాలనీలో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. నీటి సరఫరా నిలిచిపోవడంతో సమీపంలో ఉన్న విద్యుత్ మోటర్ వద్ద నీటిని తీసుకొని వస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.*

- కోటపల్లి, ఏప్రిల్ 8

నీళ్లు తెచ్చుకుంటున్న ఎస్టీ కాలనీ వాసులు

నవవధువు బలవన్మరణం

- పెళ్లయిన ఇరువై రోజులకే ఆత్మహత్య

శృతి (ఫైల్)

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 8 : ఎన్నో ఆశలతో అత్తింట అడుగుపెట్టిన నవవధువు ఊహించనిరీతిలో ప్రాణాలు తీసుకున్నది. పెళ్లయిన ఇరువై రోజులకే ఆత్మహత్య చేసుకోవడం కలచివేసింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. హాజీపూర్ మండలం టికన్నపల్లి గ్రామానికి చెందిన కంది కవిత-శ్రీనివాస్ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. ఇద్దరి పెళ్లిళ్లు కాగా, చిన్న కూతురు శృతి(22) వివాహం గత నెల 16వ తేదీన పెద్దంపేట పంచాయతీ పరిధిలోని గొల్లపల్లికి చెందిన గర్షకుర్తి సాయితో జరిగింది. పెళ్లి సమయంలో తొమ్మిది తులాల బంగారం, రూ.5 లక్షల కట్నంతోపాటు ఇతర లాంఛనాలు ఇచ్చారు. అయితే పెళ్లైన వారం నుంచే భర్త సాయితోపాటు అత్తమామ లక్ష్మి, శంకరయ్య పెళ్లికి రూ.6 లక్షలు ఖర్చు అయిందని, ఈ మొత్తాన్ని మీ తల్లిదండ్రుల నుంచి తీసుకురావాలని శృతిని వేధించారు. దీంతో తల్లిదండ్రులు అల్లుడు సాయికి సోమవారం రాత్రి రూ.50వేలు ఇచ్చి, మిగతా సొమ్మును త్వరలో ఇస్తామని నచ్చజెప్పారు. అయితే అత్తింట అడుగు పెట్టిన నాటి నుంచే వేధింపులతో మనస్థాపానికి గురైన శృతి, మంగళవారం తెల్లవారుజామున 6 గంటలకు అత్తగారి ఇంట్లోని బాత్రూంలో చున్నీతో ఉరేసుకున్నది. స్థానికులు శృతి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని గుండెలవిసేలా రోదించారు. 'అయ్యో బిడ్డా.. ఎంత పనాయే బిడ్డా..' అంటూ బోరుమన్నారు. తండ్రి కంది శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ స్వరూప్‌రాజ్ తెలిపారు. పోలీసులు శృతి భర్త, అత్తమామను అదుపులోకి తీసుకున్నారు.

పెద్దపులి ఆనవాళ్లు లేవు

కాసిపేట, ఏప్రిల్ 8 : కాసిపేట మండలంలోని గోండుగూడ సమీపంలో పెద్దపులి సంచారంపై ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దని, పులికి సంబంధించిన ఆనవాళ్లు లభించలేదని ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ ప్రవీణ్ నాయక్ తెలిపారు. మంగళవారం గోండుగూడ గ్రామ సమీపంలోని మందమర్రి, కాసిపేట సింగరేణి సమీపంలో పెద్దపులిని చూసినట్లు పలువురు కార్మికులు తెలపడంతో మళ్లీ పులి వచ్చిందోమోనని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్‌నాయక్ గోండుగూడ ప్రాంతంలో పర్యటించారు. పెద్దపులి పాదముద్రలు, ఆనవాళ్ల కోసం వెతికారు. కాని ఎటువంటి ఆనవాళ్లు లేవని, భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు.